## క్లుప్తంగా

### సోమేశ్వర శివ జ్ఞానపీఠంను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



జ్ఞానపీఠం వద్ద మొక్క నాటుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నార్కట్‌పల్లి:** మండలంలోని చెర్వుగట్టు గ్రామ సమీపంలో గల సోమేశ్వర శివ జ్ఞానపీఠాన్ని శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞానపీఠం ఆవరణలో మొక్కలు నాటారు. వారి వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, దేవాలయ ఈఓ నవీన్‌కుమార్, సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, పోతులపాటి అరుణ, సురేశ్ శర్మ, శ్రీకాంత్‌శర్మ, నాగయ్యశర్మ ఉన్నారు.

### స్థల పరిశీలన



సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ శారద

**నాంపల్లి :** ఇందిరాశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా శనివారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలో ప్లాంట్‌కు అనుకూలంగా ఉన్న దేవాలయ భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సోలార్ జిల్లా మేనేజర్ ఎం.పాండురంగారావు, తహసీల్దార్ దేవసింగ్, స్త్రీనిధి రాష్ట్ర అధ్యక్షురాలు గాలెంక ఇందిర, ఏపీఎం వినోద్ కుమార్, సీసీ సత్యనారాయణ, ప్రవీణ్, గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న సీడీపీఓ సక్కుబాయి

**మర్రిగూడ :** మండలంలోని యరగండ్లపల్లి–2, కమ్మగూడ, పడమటితండా అంగన్‌వాడీ కేంద్రాలను చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి శనివారం పరిశీలించారు. అక్కడ టీచర్లు, హెల్పర్లు లేకపోవడంతో ఇన్‌చార్జ్ అంగన్‌వాడీ టీచర్లు లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించడం లేదన్న విషయం తెలుసుకుని పరిశీలించి మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలకు, చి న్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని వారిని ఆదేశించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోధ, ఇన్‌చార్జ్ టీచర్లు ఉన్నారు.

### కారును ఢీకొన్న స్కూల్ బస్సు

**రామగిరి(నల్లగొండ) :** కారును ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఈ ఘటన నల్లగొండ మండలంలోని రాములబండ గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలంలోని బంగారుగడ్డ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు చిక్కుల రామలింగయ్య తన కారులో మరో ముగ్గురు ఉపాధ్యాయులతో కలిసి వెళ్తుండగా.. నల్లగొండ మండలం రాములబండ గ్రామ శివారులో ప్రైవేట్ స్కూల్ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

### ఘనంగా మార్కండేయ జయంతి



పద్మదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

**రామగిరి(నల్లగొండ) :** నల్లగొండ పట్టణంలోని ఎస్పీటీ మార్కెట్ కార్యాలయంలో పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోపా ప్రచార కార్యదర్శి పున్నమి అంజయ్య రచించిన పద్మదర్శిని పుస్తకాన్ని ఎస్పీటీ, పీపీటీ మార్కెట్ వ్యవస్థాపకుడు చిలువేరు చంద్రయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆనందనపు ఆదినారాయణ, పొపని వెంకటేశ్వర్లు, చిటిప్రోలు యాదగిరి, మద్దూరి శ్రీహరి, పున్న రవీందర్, రాపోలు వెంకటేశ్, శిరందాసు, రామదాసు, కర్నాటి శరత్‌బాబు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

### ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

**చండూరు (గట్టుప్పల్) :** గట్టుప్పల్ మండలంలో ఎంపీటీసీ స్థానాల సంఖ్యను పెంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. అంతంపేట గ్రామాన్ని ప్రత్యేక ఎంపీటీసీగా గుర్తించడంతో పాటు గట్టుప్పల్ మండల కేంద్రంలో ఓ ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట దుర్గయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

## అధ్వాన రహదారి




భీమారం - తుంగతుర్తి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రోడ్డు

**కేతేపల్లి:** మండలంలోని తుంగతుర్తి–భీమారం గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈరహదారికి గత పదేళ్ల నుండి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్డుపై పలు చోట్ల కంకర తేలింది. మరికొన్ని చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. ఈరోడ్డుపై తుంగతుర్తి, భీమారం, కొప్పోలు, ఉప్పలపహాడ్ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తుప్పపడుతున్న చెత్త రిక్షాలు

**చిట్యాల:** గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో గత ఏడేళ్ల క్రితం గ్రామ పంచాయతీల్లోని జనాభా సంఖ్య ఆధారంగా మూడు చక్రాల రిక్షాలను పంపిణీ చేసింది. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను వీటి ద్వారా డంపింగ్ యార్డులకు తరలించేందుకుగాను వినియోగించే వారు. కానీ గత నాలుగైదు ఏళ్లుగా గ్రామాల్లో ఈ రిక్షాలను వినియోగించటం లేదు. దీంతో రూ.వేలాది చేసిన రిక్షాలు నిలిపి ఉంచిన చోటనే శిథిలమైపోతున్నాయి.



పెద్దకాపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన వృథాగా ఉన్న చెత్త సేకరణ రిక్షా

## రేపటి నుంచి కబడ్డీ క్రీడోత్సవాలు

**నల్లగొండ :** పట్టణంలోని కేపీఎం జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 3నుంచి మిషన్ పరివర్తన్ యువతేజం కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ జుకూరి సైదులు ఆధ్వర్యంలో ఆయన క్రీడా మైదానాన్ని పరిశీలించి, టీమ్‌లకు అవసరమైన సదుపాయాలపై సమీక్షించారు. కబడ్డీలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వారి వెంట ఫిజికల్ డైరెక్టర్లు బొమ్మపాల గిరిబాబు, బానావత్ బాలు, సిబ్బంది ఉన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

## బడ్జెట్ వాయిస్

### ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వని బడ్జెట్



**నకిరేకల్ :** కేంద్ర బడ్జెట్ ఆర్థిక వృద్ధికి ఊతమివ్వని విధంగా ఉంది. ద్రవ్యోల్బణం దెబ్బకు విలవిల్లాడుతున్న మధ్యతరగతి ప్రజానీకానికి కేంద్ర బడ్జెట్ ఉపశమనం కలిగించే చర్యలు ఏమీ లేవు. ఒకవైపు ద్రవ్యోల్బణం, మరో వైపు రూపాయ మారకపు విలువ పతనంతో దిగువ మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నా వాటికి కట్టడికి చర్యలేమీ తీసుకోలేదు.

**- నర్సింహమూర్తి, నకిరేకల్**

### వంద శాతం అభివృద్ధి బడ్జెట్



**నల్లగొండ టూటౌన్ :** కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ వందశాతం అభివృద్ధి బడ్జెట్. రైతు సంక్షేమం, మధ్య తరగతికి ఉపశమనం. మహిళలకు, యువతకు సాధికారిక కల్పించడం కోసం పెట్టిన బడ్జెట్ ఇది. మౌలిక సదుపాయాల కల్పన నుంచి పెట్టుబడులను ప్రోత్సహించడం వరకు ఈ బడ్జెట్ దేశంలోని ప్రతిఒక్కరిని, వారి కలను సాకారం చేసే దిశగా ముందుకు తీసుకెళ్తుంది.

**- వర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

### బడ్జెట్ అంకెల గారడీగా ఉంది



**నల్లగొండ టౌన్ :** కేంద్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. దీంతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించకపోవడం వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతుంది. రైతుల ఆత్మహత్యల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు లేవు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిదినాలు, కనీస వేతనాలు పెంచలేదు.

**- వీరారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి**

### పేదవర్గాలకు వ్యతిరేక బడ్జెట్



**నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, పేద, మధ్య తరగతి వర్గాలకు వ్యతిరేకమైంది. బడ్జెట్‌లో తెలంగాణ విభజన అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ఎలాంటి కేటాయింపులు లేవు. కేవలం ఎన్నికలు ఉన్న బిహార్ రాష్ట్రం తప్ప తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న పెట్టింది. రైతులు పండించే పంటలకు బడ్జెట్‌లో మద్దతు ధరను ప్రస్తావించలేదు. వికసిత్ భారత్ పేరుతో మోసపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.

**- నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి**

### వేతన జీవులకు స్వల్ప ఊరట



**మర్రిగూడ :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు స్వల్ప ఊరటనిచ్చింది. ఆదాయ పన్ను రూ. 12లక్షలకు పెంచడం మంచి విషయం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ చేయడం, ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయం. కేంద్ర బడ్జెట్ పేదలకు ఆశాజనకంగా, ఉద్యోగులకు స్వల్ప ఊరట ఇచ్చింది.

**- ఉదావత్ లచ్చిరాం, మర్రిగూడ**

## మున్సిపల్ కొత్త ప్లాన్‌తో ప్రజలందరికీ న్యాయం

**రామగిరి(నల్లగొండ) :** ఇటీవల అమోదం పొందిన నల్లగొండ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌తో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ 10సంవత్సరాల పాలనలో నల్లగొండకు కొత్త మాస్టర్ చేయలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో మొదటగా నల్లగొండ మున్సిపాలిటీకి మాస్టర్ ప్లాన్ ఆమోదిస్తూ జీఓ 17ను విడుదల చేయడం హర్షణీయమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు చేసే గ్లోబల్స్ ప్రచారం ప్రజలు నమ్మరని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న కాలంలో మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ పెంచి చెల్లించలేదన్నారు. 4 నెలలుగా కార్మికులకు వేతనాలు లేవని చేస్తున్న ఆరోపణలు అవాస్తమని, డిసెంబర్ నెల మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌తో ఇళ్లకు అనుమతి, బ్యాంక్ లోన్‌లు సులువు కావడంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, వంగాల అనిల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి, పక్కన మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్‌చైర్మన్

## నిందితులకు శిక్ష పడేవరకు పోరాడుతాం

**శాలిగౌరారం :** మండలంలోని ఉప్పలంచ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు బండారు మల్లయ్యను హత్య చేసిన దుండగులకు కఠిన శిక్ష పడేవరకు పోరాడుతామని పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. ప్రత్యర్థుల చేతిలో గత 11రోజుల క్రితం హత్యకు గురైన బండారు మల్లయ్య సంతాపసభ శనివారం ఉప్పలంచ గ్రామంలో నిర్వహించారు. ఈ సంతాపసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేని పిరికిపందలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు.

**ఆర్థికసాయం అందజేత..**

మల్లయ్య కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందించిన రూ.లక్ష, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అందించిన రూ.50వేలు, కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.25లక్షల నగదును డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మృతుడి కుటింబీకులకు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ కార్యదర్శి గూని వెంకటయ్య, ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, లింగాల వెంకన్న, బండపల్లి కొమరయ్య, బొల్లికొండ గణేశ్, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు షేక్ ఇంతియాజ్, జయపాల్‌రెడ్డి, ధనుంజయ్య, షేక్ జహంగీర్, బొమ్మగాని రవి, వడ్లకొండ పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్య సంతాపసభలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

## నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

**మర్రిగూడ :** రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని తమ్మడపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను గ్రామపంచాయతీ నీటి ట్యాంకులో, ప్రభుత్వం పాఠశాలలో తాగునీటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వెంకట్, పంచాయతీ సెక్రటరీ అనూష ఉన్నారు.

**తాగునీటి ఎద్దడి నివారణకు స్పెషల్ డ్రైవ్**

**చిట్యాల :** మండలంలో వేసవి తాగునీటి ఎద్దడి నివారణకుగాను శనివారం నుంచి ఈనెల 10వతేదీ వరకు ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చిట్యాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యం శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో మోటారు పంపుసెట్లకు మరమ్మతులు, పైపులైన్ లీకేజీలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా అవసరమైన గ్రామాల్లో అద్దె బోర్లను ఏర్పాటు చేసి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.



మర్రిగూడ : ట్యాంకు నీటిని పరిశీలిస్తున్న ఏఈ వెంకటేశ్వర్లు

## పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తిప్పర్తి : ఇండ్లూర్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**రామగిరి(నల్లగొండ):** నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ మాల్‌బౌలి ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంగా వివిధ ప్రాతలు పోషించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ.యూసుఫ్, ఉపాధ్యాయులు హబీబూర్, రెహమాన్, జుబేర్, పోలే యాదాద్రి, సుశీల, సీఆర్‌పీ శ్రీధర్ పాల్గొన్నారు.

**తిప్పర్తి :** మండలంలోని ఇండ్లూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శౌకత్ అలీ, ఉపాధ్యాయులు సుచరిత, లింగమల్లు, సైదులు, ప్రదీప్, వెంకటేశం పాల్గొన్నారు.



రామగిరి (నల్లగొండ) : మౌల్‌బౌలి పాఠశాలలో..

## సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలకు ఎంపిక



త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**చిట్యాల :** పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో సబ్ జూనియర్ త్రోబాల్ క్రీడకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పానుగోతు సైదానాయక్ పాల్గొని మాట్లాడారు. క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో, క్రీడాకారుల్లో పోటీతత్వం అలవడుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనగాం రవీంధర్‌గౌడ్ పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ టి.కృష్ణారెడ్డి, ట్రెజరర్ ఎస్‌కే.జమీల్, వైస్ ప్రెసిడెంట్ చిత్ర శెనోయి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రాజు, కార్యదర్శి మోత్కురి యాదయ్య, గ్రీన్ గ్రోవ్ స్కూల్ చైర్మన్ బండి వీణా అనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, పీఈటీలు రాము, చంద్రశేఖర్, జానకి, గంగా, సాయి పాల్గొన్నారు.

## నమ్మక ద్రోహులతో మోసపోవడం ఖాయం

**నల్లగొండ టూటౌన్ :** బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్ పనులతో సంపాదించి పార్టీ మారిన నమ్మక ద్రోహులతో కాంగ్రెస్ నాయకులు కూడా మోసపోవడం ఖాయమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు కట్ట శ్రీను, బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే సంబంధిత నాయకుల బండారం బయట పెడుతామని హెచ్చరించారు. సమావేశంలో అంబటి ప్రణీత్, సంపత్‌కుమార్, జాన్‌ప్రేమ్, అనిల్‌నాయక్ పాల్గొన్నారు.

## సభలను జయప్రదం చేయాలి

**నల్లగొండ టౌన్ :** హైదరాబాద్‌లో ఏప్రిల్ 21, 22తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కార్మిక శాఖ విఫలమైందన్నారు. మెడికల్ చెకప్‌ల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై విచారణ చేయాలన్నారు. గుండె రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేఎస్.రెడ్డి, రెవెల్లి యాదయ్య, జి.నర్సింహ, యాదయ్య, నరేందర్, స్వామి, లింగయ్య, వెంకన్న, భాష, అంజయ్య, పాండు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్లు, మెటీరియల్ అందజేత

**నకిరేకల్ :** మండలంలోని తాటికల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన చనగాని రవీందర్ – భవానీ దంపతులు రూ.65వేల విలువగల కంప్యూటర్లు, పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని శనివారం పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ మేకల నాగయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్‌చంద్ర, మార్త రాములు, నర్రా వెంకట్‌రెడ్డి, లోట్లపల్లి కోటయ్య, వెంకట్‌రెడ్డి, నూకల జానయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

**స్టడీ మెటీరియల్ పంపిణీ**

పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక లయన్స్ క్లబ్, నవ్య క్లబ్‌ల ఆధ్వర్యంలో క్లబ్ రీజనల్ చైర్మన్ గుడిపూరి వెంకటేశ్వరరావు సహకారంతో శనివారం 124మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్షా ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాణాల సత్యవతి, క్లబ్ డిస్ట్రిక్ ప్రతినిధులు డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, గండూరి కృపాకర్, రవీందర్‌రెడ్డి, స్థానిక లయన్స్ క్లబ్, నవ్య క్లబ్‌ల అధ్యక్షుడు బిచినేపల్లి ప్రకాష్‌రావు, ఎన్.రమాదేవి, ప్రతినిధులు ఉన్నారు.

## అమెరికన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**నల్లగొండ:** అమెరికన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న నల్లగొండకు చెందిన పిప్పి వేణుగోపాల్‌రెడ్డిని శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో పలువురు క్రికెటర్లు, పట్టణ ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఖయ్యూం, వేణు, మోహన్‌బాబు, నగేష్, సీనియర్ క్రికెటర్లు పాల్, ప్రసన్న, జావేద్, సాయి, మధు, ఖదీర్, రవి, బషీర్, తహసీల్దార్ హరి, సీఐ మక్దూమ్, రహీమ్, బాబి పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**కులవృత్తిదారుల సంఘం కమిటీ ఎన్నిక**

**చిట్యాల :** మండల కేంద్రంలో కుల వృత్తిదారుల సంక్షేమ సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిళ్ల లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

**బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి**

**మునుగోడు :** ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కట్ట వెంకన్న, శివ ఉన్నారు.

**విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత**

**చిట్యాల :** మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం స్మారకార్థం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరీక్ష ప్యాడ్లను, అట్లాస్, పెన్నులను శనివారం డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పందిరి రమేష్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి, డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు బూరుగు గోపికృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

**ఎంపీడీఓకు వినతి**

**మర్రిగూడ :** మండలంలోని నామాపురం ఎంపీటీసీ పరిధిలో ఉన్న మేటిచందాపురం గ్రామాన్ని, కొట్టాల గ్రామపంచాయతీని శివన్నగూడెం ఎంపీటీసీ పరిధిలో చేర్చాలని నామాపురం మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ కోరారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జి.చినమునయ్యకు వినతిపత్రం అందజేశారు. వారివెంట బీఆర్‌ఎస్ నాయకుడు చెరుకు లింగంగౌడ్, ఏరుకొండ లింగస్వామి, ఏరుకొండ అబ్బయ్య, భిక్షం, లపంగి సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

**వీధిదీపాలు ఏర్పాటు చేయాలి**

**చిట్యాల :** పట్టణంలో హైవే వెంట గల సర్వీస్ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన వీధిదీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని, ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే చేపట్టాలని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మెండె సైదులు, నాయకులు జిట్ట బొందయ్య, రుద్రవరం యాదయ్య పాల్గొన్నారు.

**నర్సింహారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి**

**చండూరు :** చండూరు మాజీ వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నరసింహారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో జరిగిన నర్సింహారెడ్డి రెండో వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, పార్టీ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, బొడ్డు వెంకటేశ్వర్లు, పల్లె యాదయ్య పాల్గొన్నారు.

**బీరెల్లిగూడెంలో వైద్యశిబిరం**

**మునుగోడు :** మండలంలోని బీరెల్లిగూడెంలో శనివారం ప్రభుత్వ వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురు కొద్ది రోజులుగా విషజ్వరాల బారినపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాక్షిదినపత్రికలో బీరెల్లిగూడెంలో విషజ్వరాలు అనే వార్త ప్రచురించగా వెంటనే స్పందించిన వైద్యసిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూస్ అధికారులు గ్రామానికి సందర్శించి మంచినీటి ట్యాంకులను పరిశీలించారు.

**మహాసభను జయప్రదం చేయాలి**

**నార్కట్‌పల్లి :** నల్లగొండ పట్టణంలో ఈనెల 17, 18తేదీల్లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ 45వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముస్కు రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అరుణ్‌తేజ, అన్వేష్, హరీష్, అనిల్, ఉపేందర్, తరుణ్, వంశీ సందీప్, మధు ఉన్నారు.

**విద్యార్థులకు స్నాక్స్ వితరణ**

**నార్కట్‌పల్లి :** మండలంలోని అమ్మనబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్ శనివారం స్నాక్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో కావేరి, శ్రీదేవి, లక్ష్మారెడ్డి, శారద, లక్ష్మమ్మ, పారిజాత, లింగయ్య, విజయకుమార్, నుస్రత్‌సుల్తానా ఉన్నారు.

**దర్వేశిపురం ఆలయంలో పూజలు**

**కనగల్ :** మండలంలోని దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గం అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన దర్వేశిపురం ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఆర్‌టీఏ మెంబర్‌గా ఎన్నికైన కూసుకుంట్ల రాజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాదం అనిల్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, మంచికంటి సిద్దార్థ, జూకాటి పృథ్వీ, నరేష్, గోపాల్, శివరాం, రాజశేఖర్ పాల్గొన్నారు.

**ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి**

**నార్కట్‌పల్లి :** పదోతరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని లయన్స్ క్లబ్ సూర్యాపేట రీజినల్ చైర్‌పర్సన్ గుడిపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ చాలెంజర్స్ నల్లగొండ అధ్యక్షుడు అద్దంకి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాములు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వనం శ్రీకిషన్, కాంగ్రెస్ నాయకులు సర్వర్‌అలీ, రాజు ఉన్నారు.

**చట్టాలను తొలగిస్తే ఊరుకోం**

**మునుగోడు :** వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేసి సాధించుకున్న చట్టాలను ప్రభుత్వాలు తొలగించే ప్రయత్నాలు చేసే ఊరుకునే ప్రసక్తేలేదని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈద యాదయ్య, ఏర్పుల నర్సింహ, గిరి, గిరి, స్వామి ఉన్నారు.

**విద్యార్థినులకు సైకిళ్లు అందజేత**

**చిట్యాల :** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఐదుగురు పేద విద్యార్థినులకు శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండెబోయిన సైదులు, క్లబ్ ప్రధాన కార్యదర్శి కంభంపాటి నర్సింహ, మారగోని రమేష్, ఎడ్ల శ్రీశైలం, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

**కట్టంగూర్:** హైవే వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అయిటిపాముల గ్రామ శివారులోని చెర్వుఅన్నారం బస్టాప్ సమీపంలో గుర్తుతెలియని మహిళ (వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు) విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు హైవే వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. వెనుక నుంచి వచ్చిన వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో శరీర భాగాలు చెల్లాచెదురై గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. విషయం తెలుసుకున్న అయిటిపాముల గ్రామపంచాయతీ కార్యదర్శి జి. అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మహిళ శరీరభాగాలను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు ఎరుపు రంగు చీర, నీలం రంగు జాకెట్ ధరించినట్లు తెలిపారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు.